ఈనాడు ఒడిశా
మంగళవారం అక్టోబరు 1, 2024

భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు

● పలువురు ఎస్పీలకు జిల్లాల మార్పు

భువనేశ్వర్, న్యూస్‌టుడే

రాష్ట్రంలో వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న మోహన్ చరణ్ మాఝి సర్కారు ఐపీఎస్ అధికారులను భారీగా బదిలీ చేసింది. గత ప్రభుత్వానికి విధేయులుగా ఉన్నవారిలో కొందరికి ప్రాధాన్యం లేని పోస్టు నియమించింది. అనుకూలురకు కీలక బాధ్యతలు అప్పగించింది. యోగేష్ బహదూర్ ఖరానియా డీజీపీగా నియమితులైన తరువాత ఐపీఎస్‌ల మార్పులు, చేర్పులు జరుగుతాయన్న అంచనాలు పెరిగాయి. ఎట్టకేలకు కసరత్తు పూర్తి చేసిన హోంశాఖ ఆదివారం రాత్రి బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో 22 మంది ఎస్పీలు జిల్లాలు మారాయి. త్వరలో మరో విడత బదిలీలు జరుగుతాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. అక్టోబరులో రెండో జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది.



జంట నగరాల కమిషనర్ సురేష్ దేవదత్త సింగ్ | రైల్వే మెరైన్ ఏడీజీ అరుణ్ బొత్రా | భువనేశ్వర్ డీసీపీ పినాకి మిశ్ర | బ్రహ్మపుర ఎస్పీ శ్రవణ వివేక్ | నవరంగపూర్ ఎస్పీ రోహిత్ వర్మ | రాయగడ ఎస్పీ స్వాతి ఎస్.కుమార్

ఎవరు	ప్రస్తుతం	బదిలీ
సంజీవ్ మిశ్ర	జంట నగరాల కమిషనర్	బీపీఎస్‌పీఏ సంచాలకుడు
సురేష్‌దేవదత్త సింగ్	ఏడీజీ ఆపరేషన్స్	జంట నగరాల కమిషనర్
అరుణ్ బొత్రా	క్రైంబ్రాంచ్ ఏడీజీ	రైల్వే, మెరైన్ ఏడీజీ
వినయ్‌తోష్ మిశ్ర	సీఐడీ సంచాలకుడు	క్రైంబ్రాంచ్ ఏడీజీ
ఎస్.ఎం.నర్వానె	హోంశాఖ ఓఎస్‌డీ	ప్రింటింగ్ ప్రెస్ సంచాలకుడు
సౌమ్యేంద్ర ప్రియదర్శి	నిఘా సంచాలకుడు	నిఘా ఆధునికీకరణ ఏడీజీ
ఆర్.పి.కోచె	ఆర్మ్‌డ్ పోలీస్ ఏడీజీ	నిఘా విభాగం ఏడీజీ
రాజేష్‌కుమార్	ఆర్మ్‌డ్ పోలీస్ సంచాలకుడు	నిఘా విభాగం సంచాలకుడు
సంతోష్ బాల	హౌసింగ్ కార్పొరేషన్	సీఎండీ హోంశాఖ కార్యదర్శి
రాధాకిషన్ శర్మ	హోంశాఖ ఓఎస్‌డీ	హౌసింగ్ కార్పొరేషన్ సీఎండీ
అనూప్‌కుమార్ సాహు	నిఘా విభాగం సంచాలకుడు	బీపీఎస్‌పీఏ సంచాలకుడు

ఎస్పీల స్థాయిలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ
పినాకి మిశ్ర	పూరీ ఎస్పీ	భువనేశ్వర్ డీసీపీ
మద్కర్ సందీప్ సంపద్	డెంకనాల్	భద్రక్
అనుపమ జెమ్స్	దేవగఢ్	విజిలెన్స్
రాహుల్ పి.ఆర్	జగత్సింగ్‌పూర్	విజిలెన్స్
జగ్మోహన్ మీనా	గంజాం	కటక్ డీసీపీ
లోగనాయగి దివ్య	కటక్ రూరల్	విజిలెన్స్
ప్రతీక్ సింగ్	భువనేశ్వర్ డీసీపీ	కటక్ రూరల్
రాహుల్ జైన్	నయాగఢ్	అనుగుల్
శ్రవణ వివేక్.ఎం	విజిలెన్స్ ఎస్పీ	బ్రహ్మపుర
వినీత్ అగ్రవాల్	జాజ్‌పూర్	పూరీ
వరుణ్ గుంటుపల్లి	భద్రక్	మయూర్‌భంజ్
సాగరికానాథ్	బాలేశ్వర్	ఖుర్దా ఎస్పీ
స్వాతి ఎస్.కుమార్	గజపతి	రాయగడ
ఎస్.సుశ్రీ	మయూర్‌భంజ్	నయాగఢ్
నితేష్ వాధ్వానీ	మల్కాన్‌గిరి	నయాగఢ్
రాజ్‌ప్రసాద్	బౌద్ధ్	బాలేశ్వర్
నాగరాజ్ దేవరకొండ	పోలీస్ కార్యాలయంలో ఏఐజీ	బౌద్ధ్ ఎస్పీ
సువేందుకుమార్ పాత్ర	కొంధమాల్	గంజాం ఎస్పీ
అభినవ్ సొంకర్	కొరాపుట్	డెంకనాల్
రోహిత్ వర్మ	నవరంగపూర్	కొరాపుట్
యాసస్‌ప్రతాప్‌శ్రీమాల్	సోన్‌పూర్	జాజ్‌పూర్
హర్ష బి.సి.	రాయగడ	కొంధమాల్
అనిల్‌కుమార్ మిశ్ర	భువనేశ్వర్ సహాయ డీసీపీ	దేవగఢ్
రాంప్రసాద్ సాహు	పోలీస్ కార్యాలయం అధికారి	సోన్‌పూర్
భవానీశంకర్ ఉద్గాత	డెంకనాల్ ఎస్పీ	జగత్సింగ్‌పూర్
మిహిర్ పండా	పోలీస్ కార్యాలయ అధికారి	నవరంగపూర్
జితేంద్రకుమార్ పండా	పోలీస్ సెక్యూరిటీ అధికారి	గజపతి

తప్పని డోలీ బాధలు



రోగిని కాలువ దాటిస్తున్న గ్రామస్థులు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి సువాగద పంచాయతీ రథగుడలో డోలీ బాధలు తప్పడం లేదు. గ్రామానికి చెందిన దమ పూజారి (50) అనారోగ్యం బారిన పడ్డాడు. రథగుడ నుంచి మంత్రిపుట్ వరకు రహదారి మార్గం ఉన్నా మంత్రిపుట్ వద్ద కాలువపై వంతెన లేకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 8 కి.మీ. డోలీపై కలువ వరకు నడక సాగించి అంబులెన్స్‌లో ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

2 కోట్ల మందికి కేవైసీ నవీకరణ పూర్తి

● మరో 45 రోజుల్లో 1.5 కోట్ల మంది పీడీఎస్ లబ్ధిదారులకు అవకాశం



సరకులు తీసుకుంటున్న కార్డుదారులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఆహార భద్రత పథకం కింద అనర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కేవైసీ నవీకరణ జోరుగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియతో రాష్ట్రంలో ఇంత వరకు 2 కోట్ల మందికి నవీకరణ పూర్తి కాగా, రానున్న 45 రోజుల్లో మరో 1.5 కోట్ల మందికి పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై ఆహార సరఫరాలు, వినియోగదారుల సంక్షేమశాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ ఆహార భద్రత పథకాల కింద లబ్ధిపొందుతున్న అనర్హులను తొలగించి కొత్తగా అర్హులైన వారిని ఇందులో చేర్చాలన్న ఉద్దేశంతో ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఆహార భద్రత పథకాల కింద రాష్ట్రంలో దాదాపు 80 శాతం జనాభాకు లబ్ధి చేకూరుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఎన్ఎఫ్ఎస్ఏ కింద ఎక్కువ మంది..

జాతీయ ఆహార భద్రత చట్టం కింద రాష్ట్రంలో అత్యధికంగా 80.13 లక్షల కుటుంబాలకు చెందిన 2.88 కోట్ల మంది లబ్ధి పొందుతున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. అంత్యోదయ అన్న యోజన కింద 12.52 లక్షల మందికి అవకాశం వస్తోంది. దీంతోపాటు రాష్ట్ర ఆహార భద్రత పథకం కింద మరో 3.15 లక్షల కుటుంబాలకు చెందిన 10.02 లక్షల మంది లబ్ధి పొందుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం: ప్రభాతి



ప్రదర్శన తిలకిస్తున్న ప్రభాతి పరిడ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ అవుతున్న 'చౌతువా' నాసిరకంగా ఉండడం దురదృష్టకరమని మహిళా, శిశు సంక్షేమశాఖలను పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ అన్నారు. భువనేశ్వర్‌లో సెప్టెంబరు 1 నుంచి 30 వరకు శిశు సంక్షేమశాఖ పిల్లల సంరక్షణ, పర్యవేక్షణ కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాతి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల ధ్యేయంగా నాణ్యమైన పౌష్టికాహారం సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చౌతువా స్థానంలో రాగితో చేసిన వంటకాలు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఆహార సామగ్రి ఒకేలా కాకుండా, ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ప్రదర్శనను ఆమె తిలకించారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆరతి అహుజా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సహజ అందాలు.. సంబల్‌పూర్ సొంతం

● పెరుగుతున్న పర్యాటకుల తాకిడి



పర్యాటకులను కట్టిపడేస్తున్న ప్రకృతి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: సహజ అందాలకు నిలయంగా పేరొందిన సంబల్‌పూర్ జిల్లాలో పర్యాటకుల తాకిడి పెరిగింది. కొవిడ్ సమయంలో రెండేళ్ల క్రితం తగ్గిన సందర్శన మళ్లీ పుంజుకుంది. విదేశీయులు పర్యటిస్తున్నారు. హిరాఖుడ్ డ్యాం, పలు చరిత్రాత్మక మందిరాలు, డెబ్రిగఢ్ అభయారణ్యం తదితర ప్రదేశాలు చూసేందుకు వస్తున్న వీక్షకులతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు ఉషాకోఠి, చిప్లిమా, ఘంటేశ్వర్ మందిర మార్గం తదితర ప్రదేశాలు పర్యాటకానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వదేశ దర్శన్ ప్రోగ్రాం కింద జిల్లాకు విదేశీ పర్యాటకుల తాకిడి మరింత పెరగనుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ద్వారా వారసత్వ ప్రదేశాలను చూసేందుకు పర్యాటకులకు మరింత వెసులుబాటు కలిగిస్తున్న నేపథ్యంలో మరింత సందడి పెరిగే అవకాశం ఉంది. ఈ విషయమై సంబల్‌పూర్ జిల్లా పర్యాటకశాఖ అధికారి ఆర్.కె.దొళై మాట్లాడుతూ 2020-21తో పోలిస్తే 2023-24లో విదేశీ, స్వదేశీ పర్యాటకుల తాకిడి విపరీతంగా పెరిగిందన్నారు. ముఖ్యంగా చిప్లిమా, గుద్గుద, కెంధర, ఉషాకోఠి ప్రాంతాల్లో ఇది ఎక్కువగా ప్రభావం చూపిందన్నారు.

అయిదు రెట్లు పెరిగిన సందర్శకులు..

2020-21తో పోలిస్తే జిల్లాలో పర్యాటకుల తాకిడి ఐదు రెట్లు పెరిగినట్లు పర్యాటక శాఖ కార్యాలయం రికార్డులు చెబుతున్నాయి. 2020-21లో 1,22,021 మంది స్వదేశీ పర్యాటకులు రాగా 2023-24 నాటికి ఆ సంఖ్య 5,92,461కి చేరింది. విదేశీ పర్యాటకుల విషయానికొస్తే ఈ సంఖ్య 60 నుంచి 812కి ఎగబాకింది.

సందర్శకుల తాకిడి వివరాలు

ప్రదేశం	2020-21	2023-24
ఉషాకోఠి	2147	28234
చిప్లిమా	77984	230732
గుద్గుద	34633	146399
కెంధర	4462	16260



అధికారులతో జస్టిస్ దాస్ సమావేశం



భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని భరత్‌పూర్ ఠాణా ఘటనపై దర్యాప్తు బాధ్యతలు చేపట్టిన జస్టిస్ **చిత్తరంజన్ దాస్** కమిషన్ మంగళవారం నుంచి కార్యాచరణకు దిగింది. దీనికి ముందుగా సోమవారం హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యబ్రత సాహు, డీజీపీ యోగేష్ బహదూర్ ఖరానియా తదితర అధికారులతో ప్రభుత్వ సర్క్యూట్ అతిథి భవనంలో సమావేశమయ్యారు. కమిషన్ భువనేశ్వర్‌లో ఉండడానికి భవనం, సిబ్బంది నియామకాలపై చర్చించినట్లు తెలిసింది. రెండు నెలల్లో అధ్యయన నివేదిక సమర్పించాలని ప్రభుత్వం కమిషన్‌ను కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం నోటిఫికేషన్ జారీ అవుతుంది. సెప్టెంబరు 17 రాత్రి భరత్‌పూర్ ఠాణా పరిధిలోని చందకా ప్రాంతంలో రక్షణ శాఖ అధికారి, ఆయన స్నేహితురాలిని వేధించిన వారి గురించి ప్రత్యక్ష సాక్షులు ప్రమాణ పత్రాలు సమర్పిస్తారు. కమిషన్ ఠాణా అధికారుల వాంగ్మూలాలూ రికార్డు చేస్తుందని తెలిసింది. ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తు బాధ్యత క్రైం బ్రాంచ్‌కు కూడా అప్పగించింది. ఈ నేపథ్యంలో జస్టిస్ దాస్ కమిషన్ ఇంత వరకు దర్యాప్తు చేసిన క్రైం బ్రాంచ్ అధికారులనూ ప్రశ్నించే అవకాశం ఉంది.

ప్రమాదస్థితిలో బతపోరిసి వారధి



రాళ్లు తేలిన రహదారి

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; రాయగడ-కల్యాణ సింగుపూర్ ప్రధాన రహదారిలో బతపోరిసి గ్రామ సమీపంలో నాగావళి నదిపై కొత్తగా నిర్మించిన వంతెన ప్రమాదస్థితికి చేరుకుంది. దీనికి ఇరువైపులా వేసిన అనుబంధ రహదారి కుంగిపోవడంతోపాటు మట్టి కూడా జారిపోయింది. రహదారి మధ్యలో ఏర్పడిన గోతుల్లో వర్షం నీరు నిలిచి వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మార్గమంతా రాళ్లు తేలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తయిన ఏడాదికే ఇలా పాడైంది. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడమే ఇందుకు కారణం. అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అయిదేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు చూసుకోవాల్సిన గుత్తేదారు పట్టించుకోవడం లేదని ఈ ప్రాంతవాసులు అంటున్నారు. ఈ సమస్యపై యంత్రాంగానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని బతపోరిసి గ్రామస్థులు వాపోతున్నారు. కె.సింగుపూర్ జడ్పీ సభ్యుడు గుడ్ల ప్రసాద్ వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతానని అన్నారు.



అటవీ శాఖ సిబ్బంది అదుపులో నిందితులు



స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

మల్కాన్‌గిరిలో 489 తాబేళ్లు పట్టివేత

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ అటవీ శాఖ సిబ్బంది 489 తాబేళ్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరిని అరెస్టు చేశారు. సోమవారం ఉదయం చిత్రకొండ సమితి సరిహద్దు రాజుల్కొండ గ్రామం వద్ద సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ వాహనం అతి వేగంగా రావడం గమనించి ఆపి తనిఖీ చేయగా అందులో బస్తాల్లో తాబేళ్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. ఆ బస్తాల్లో 489 తాబేళ్లు ఉన్నాయి. వీరు ఆంధ్రప్రదేశ్ నుంచి వీటిని కొనుగోలు చేసి మల్కాన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎం.వి.72, ఎం.వి.88 గ్రామాల్లో అమ్మడానికి తీసుకువెళ్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులు మల్కాన్‌గిరి సమితి ఎం.వి.96 గ్రామానికి చెందిన ప్రసంజిత్ ఘరామి, సందీప్ బెపారి అని పోలీసులు తెలిపారు. తాబేళ్లను సంరక్షించారు. తర్వాత నీటి వనరులో విడుదల చేస్తారు.

బీఎంసీ బిజదలో తిరుగుబాటు



బీఎంసీ కార్యాలయం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ నగరపాలక సంస్థలో బిజదలో తిరుగుబాటు మొదలైంది. ఇక్కడ మొత్తం 67 మంది కార్పొరేటర్లకుగాను బిజదకు 47, భాజపాకు 12 మంది, ముగ్గురు స్వతంత్రులు, మిగిలిన వారు కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. బిజదలోని 30 మంది ఇప్పుడు తిరుగుబాటు బావుటా ఎగరేస్తున్నారు. వీరంతా సోమవారం బస్సులో లోకనాథస్వామి దర్శనం పేరిట పూరీ వెళ్లారు. అక్కడ రహస్యంగా మంతనాలు జరిపినట్లు తెలిసింది. బీఎంసీలో బిజద అధికారంలో ఉంది. కొందరు కార్పొరేటర్లు మేయరు సులోచనా దాస్‌ను వ్యతిరేకిస్తున్నారు. గత శుక్రవారం జరిగిన సమావేశానికి వీరంతా గైర్హాజరయ్యారు. వీరికి అమరేష్ జెనా, బిరించి మహాసుపువార్ నాయకత్వం వహిస్తున్నారు. ఇక్కడి పరిస్థితి బిజద అధినేత నవీన్ పట్నాయక్ దృష్టికి వెళ్లడంతో పరిస్థితిని చక్కదిద్దాలని పార్టీ భువనేశ్వర్ నగర అధ్యక్షుడు సుశాంత రౌత్‌ను ఆయన ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం రౌత్ కార్పొరేటర్లు జెనా, సుపువార్‌లతోపాటు వివేక్ స్వెయిన్, రాజేష్ పాత్రలకు శ్రీముఖాలు జారీ చేశారు. 15 రోజుల్లోగా వివరణ తెలియజేయాలని సూచించారు. మరోవైపు జెనా, సుపుకార్‌లు విలేకరులతో మాట్లాడుతూ.. తామంతా ముక్కంటి, జగన్నాథ దర్శనానికి పూరీ వెళ్లామన్నారు. శ్రీముఖాలపై తమ అభిప్రాయం నాయకత్వానికి తెలియజేస్తామన్నారు.



అమ్మవారికి ప్రత్యేక సేవలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ శక్తి పీఠం కేంఝర్ జిల్లా ఘటగాం తరిణి అమ్మవారి సన్నిధిలో ఆశ్వీయుజ మాసం బహుళ పక్షమిని పురస్కరించుకొని షోడశోపచార పూజలు కొనసాగుతున్నాయి. త్రయోదశి తిథిని పురస్కరించుకొని సోమవారం తల్లికి ప్రత్యేక సేవలు నిర్వహించారు. అమ్మవారిని దివ్యాలంకరణ చేశారు.

ఆర్టీసీకి కాయకల్ప చికిత్స: బిభూతి



చెన్నైలో అధికారులతో మంత్రి బిభూతి చర్చలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: నష్టాలు చవిచూస్తున్న రహదారి రవాణా సంస్థను (ఆర్టీసీ) లాభాల బాట పట్టించాలన్న ధ్యేయం గల ప్రభుత్వం ఇందుకోసం కసరత్తు ప్రారంభించింది. గోపాలపూర్ శాసనసభ్యుడు, రవాణా, వాణిజ్య శాఖల మంత్రి బిభూతి భూషణ్ జెనా సోమవారం చెన్నై వెళ్లి తమిళనాడు ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించారు. అనంతరం బిభూతి 'న్యూస్‌టుడే'తో ఫోన్‌లో మాట్లాడుతూ తమిళనాడులో ఆర్టీసీ అనుసరిస్తున్న విధానాలు సమీక్షించి, రాష్ట్రంలో సంస్కరణల అమలు చేయాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. త్వరలో ప్రభుత్వం మరికొన్ని అత్యాధునిక సౌకర్యాలు గల బస్సులు కొనుగోలు చేస్తుందని, కొత్త మార్గదర్శకాలు అమలు చేస్తామని చెప్పారు. మంత్రి చెన్నై పర్యటన నేపథ్యంలో అక్కడి ఒడియా సంఘాల ప్రతినిధులు మంత్రిని స్వాగతించాయి.

అంతుచిక్కని వ్యాధితో ఇద్దరి మృతి

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; రాయగడ జిల్లా కల్యాణసింగుపూర్ సమితి సిరిగుమ్మ పంచాయతీ అనికెండ గ్రామంలో అంతుపట్టని వ్యాధితో ఆదివారం రాత్రి ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో స్వచ్ఛంద సేవా సంస్థల సహాయంతో కె.సింగుపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉండి రహదారి సౌకర్యం లేని గ్రామంలో ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... 20 రోజుల క్రితం 10 మంది జ్వరాల బారిన పడ్డారు. నాటుమందు వాడడంతో లలిత మినయక (16), పలయి జిలసిక (36) మృతి చెందారు. వైద్య బృందం గ్రామానికి చేరుకుని వైద్యం అందిస్తున్నారు. దీనిపై జిల్లా ఆసుపత్రి నిర్వాహకుడు రాజేష్ మాట్లాడుతూ వ్యాధి నిర్ధారించేందుకు తాగునీటితోపాటు రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపామని అన్నారు.

జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులకు పతకాలు



పసిడి పతకంతో అనిమేష్ కుజుర్



గేసన్‌జీవా



లక్ష్మిప్రియ కిసాన్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బిహార్‌లో కొనసాగుతున్న నాలుగో జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆదివారం నిర్వహించిన పలు అంశాల్లో ముగ్గురు రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈమేరకు రాష్ట్ర క్రీడావిభాగం 'ఎక్స్'లో ఆ వివరాలు వెల్లడించింది. పోటీల్లో పురుషుల విభాగంలో 100 మీటర్ల పరుగులో అనిమేష్ కుజుర్ మొదటిస్థానంలో నిలిచి పసిడి పతకం గెలుచుకున్నారు. 110 మీటర్ల హర్డిల్స్‌లో గ్రేసన్‌జీవా మొదటిస్థానం దక్కించుకుని పసిడి పతకం, మహిళల విభాగంలో 1500 మీటర్ల పరుగులో లక్ష్మిప్రియ కిసాన్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం కైవశం చేసుకున్నారు. వీరిని క్రీడాశాఖ అభినందనలు తెలిపింది.



దక్షిణ మండల ఆర్డీసీ కార్యాలయం బయట ప్రదర్శన

డిమాండ్లు నెరవేర్చాలని ప్రదర్శన

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక సంఘం 'ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్' (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా, వివిధ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సోమవారం దక్షిణ మండల ఆర్డీసీ కార్యాలయం బయట ప్రదర్శన నిర్వహించారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండు చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని తదితర 23 డిమాండ్లు చేశారు. అనంతరం ప్రతినిధులు ప్రధాని పేరిట వినతిపత్రాన్ని ఆర్డీసీ కార్యాలయం అధికారులకు అందజేశారు. ఈ ప్రదర్శనలో ఐఎఫ్‌టీయూ, దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోతిలో పడిన ఏనుగు



భువనేశ్వర్, న్యూస్‌టుడే: కలహండి జిల్లా లెసింగ అటవీ రేంజ్ పరిధిలో పర్లసింగ వద్ద ఏనుగు గోతిలో పడింది. అందులోని బురదలో చిక్కుకొని ఘీంకారాలు చేయడంతో విన్న ఈ ప్రాంత ప్రజలు అధికారులకు తెలియజేశారు. సోమవారం ఘటనా స్థలానికి వచ్చిన అధికారులు క్రేన్‌కు తాళ్లు కట్టి ఏనుగును వెలుపలికి సురక్షితంగా తీశారు. సమీపంలోని అడవిలోకి తరలించారు.

ఖేలో ఇండియా ఈత పోటీల్లో రాష్ట్రానికి పతకాలు



పతకాలతో జూనియర్ బాలికలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఖేలో ఇండియా జూనియర్ బాలికల ఈత పోటీలు ఆదివారం ముగిశాయి. సంబల్‌పూర్‌లోని జనకేతన్ సాహు స్విమ్మింగ్‌పూల్‌లో జరిగిన పోటీల్లో వివిధ అంశాల్లో రాష్ట్రానికి పతకాలు వరించాయి. ముగింపు రోజు నిర్వహించిన ఐదులో రాష్ట్ర బాలికలు రాణి నాయక్, ప్రీతిక్ష నంద, ప్రియదర్శిని రౌత్, చిన్మయి బెహరా, విద్యాలేఖ్యజ్యోతి ప్రధాన్, అంకితాలారస్ సాహు, అర్పిత సామల్, ఊహినా బెహరా 100, 200, 400 మీటర్ల ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, బటర్‌ఫ్లై అంశాల్లో ఏడు పసిడి పతకాలు, ఆరు రజత పతకాలు, నాలుగు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. వీటితో కలిపి మొత్తం పోటీల్లో రాష్ట్రానికి 39 పతకాలు దక్కాయి.

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాభివృద్ధి మరింత పదును పెంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని పాలనాధికారి బిజయ్‌కుమార్ దాస్ అన్నారు. సోమవారం రాయగడ సమితిలోని ఎస్ ఎస్‌డీ ఉన్నత పాఠశాల్లో రెండు రోజులపాటు ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యంగా ఐటీడీఏ పీఏ దిలీప్‌కుమార్ బెహరా, విద్యాఅధికారి మాయదర్ సాహు, జిల్లా సంక్షేమాధికారిని మమతా పరిడా, ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్ షాహుకారి తదితరులు పాల్గొన్నారు.

4న అవిభక్త కొరాపుట్ జిల్లాలో బంద్‌కు పిలుపు

నవరంగపూర్, న్యూస్‌టుడే: జిల్లాల వారీగా ఉద్యోగ నియామకం కోసం డిమాండ్ చేస్తూ నవరంగపూర్ జిల్లాలో జాయింట్ యాక్షన్ కమిటీ తరపున ఈ నెల 4న అవిభక్త కొరాపుట్ జిల్లాలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం రాత్రి డాబుగావ్ ఆర్ఎంసీ గిడ్డంగిలో సమావేశం జరిగింది. మాజీ శాసన సభ్యుడు భుజబల్ మాఝి, కాంగ్రెస్ నేత రామచంద్ర కడమ్ నేతృత్వంలో 13 మంది శాసన సభ్యులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేస్తామని తెలిపారు. మాజీ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి, శాసన సభ్యులు మనోహర్ రంధారి, సదాశివ్ ప్రధాన్, తదితరులు పాల్గొన్నారు.

బిజద పాదయాత్రపై సమీక్ష



మాట్లాడుతున్న మాజీ శాసన సభ్యుడు సదాశివ్ ప్రధాన్

నవరంగపూర్, న్యూస్‌టుడే: అక్టోబర్ 2 నుంచి ప్రారంభం కానున్న బిజద పాదయాత్రపై నవరంగపూర్ బిజద కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. చందహండి సమితి నుంచి ఈ యాత్ర ప్రారంభం కానున్నట్లు జిల్లా అధ్యక్షుడు రమేష్‌చంద్ర మాఝి చెప్పారు. 2-6 వరకు మొదట విడతగా, 21-30 తేదీ వరకు రెండోవ విడతగా ఈ యాత్ర జరగనున్నట్లు, నూతన కార్యకర్తల సమ్మేళన జరగనున్నట్లు నవరంగపూర్ మాజీ శాసన సభ్యుడు సదాశివ్ ప్రధాన్ తెలిపారు. డాబుగావ్ ఎమ్మెల్యే మనోహర్ రంధారి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు మోతీరాయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేలానికి అర్పణ బియ్యం

గోపాలపూర్, న్యూస్‌టుడే: భక్తులు జగన్నాథునికి సమర్పించుకున్న బియ్యం వేలం వేయడానికి నిర్ణయించామని, ఈ సొమ్ము శ్రీక్షేత్రానికి చెందుతుందని పూరీ పాలనాధికారి సిద్ధార్థ్ శంకర్ స్వాయిన్ చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వేలంలో మిల్లర్లు, ప్రజలు పాల్గొనవచ్చన్నారు. జనవరిలో శ్రీజగన్నాథ పరిక్రమణ మార్గం ప్రారంభానికి ముందు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రచార రథాల ద్వారా బియ్యం సేకరించిన సంగతి తెలిసిందే. 10 వేల క్వింటాళ్ల బియ్యం గుండిచా మందిరం ఆవరణలో మూలుగుతున్నాయి. కొంతమేరకు పాడయ్యాయి. ఎట్టకేలకు ఈ బియ్యాన్ని విక్రయించాలని యంత్రాంగం నిర్ణయించింది.

మందిరం పరిసరాలు శుభ్రం



బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: భాజపా బ్రహ్మపుర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సేవా పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం నీలకంఠేశ్వరస్వామి మందిరం, పరిసరాలు శుభ్రపరిచే కార్యక్రమం జరిగింది. పలువురు భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొని చెరువు ఒడ్డున చెత్తాచెదారాలు శుభ్రపరిచారు. కార్యక్రమంలో బిష్ణు సుబుద్ధి, అశోక్ శుక్లా, సంజయ్ జెనా, బద్రి నాయక్, రంజిత్ పట్నాయక్, ప్రదీప్ నాయక్, శరత్ పట్నాయక్, సురేష్‌చంద్ర త్రిపాఠి, కె.సాయి కుమార్, విక్కీ ఆచారి తదితరులు పాల్గొన్నారు.


అనధికార నిర్మాణాలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురంలో ఆవాస్ యోజన్ కింద పొందిన స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు బదులు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా 30 చదరపు అడుగుల భూమిని లబ్ధిదారుడికి కేటాయిస్తారు. టంకువా పంచాయతీ పరిధి పూర్ణగడ్, కపిలేశ్వర్ నగర్ ప్రాంతాల్లోని ఇళ్లకు బదులు దుకాణాలు వెలుస్తున్నాయి. కేటాయించిన కొలతలు కంటే అధికంగా ఉన్న స్థలంలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఈవో సిద్ధార్థ్ పట్నాయక్‌ను అడగ్గా ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని, దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు

వలస పక్షుల సందడి



వలస పక్షులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝార్‌గ్రామ్ జిల్లా జాంబోని పరిధి కెందువా గ్రామంలో వలస పక్షుల సందడి మొదలైంది. సైబీరియా కొంగలను చూసేందుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. సెప్టెంబరులో ఇక్కడికి వచ్చి తిరిగి డిసెంబరులో సైబీరియాకు వెళ్లిపోతాయని స్థానిక ఉపాధ్యాయుడు జితేంద్ర నాథ్ మహతో తెలిపారు. రాత్రివేళల్లో కొంత మంది వేట సాగిస్తున్నారని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కెందువా గ్రామస్థుల ఫిర్యాదు తమకు అందిందని తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



శ్రీశ్రీకళావేదిక ఒడిశా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

శ్రీశ్రీ కళావేదిక ఒడిశా కార్యవర్గం ఏర్పాటు

గుణుపురం, న్యూస్‌టుడే: ఆంధ్రాలోని శ్రీశ్రీ కళావేదిక కవులు, తెలుగు సాహితీవేత్తలను అక్కున చేర్చుకుని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీశ్రీకళావేదిక ఒడిశా విభాగ కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసింది. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఒడిశా కవులు, సాహితీవేత్తలతో కమిటీ ఏర్పాటైంది. శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. ఒడిశా రాష్ట్రం కళావేదిక అధ్యక్షుడిగా టీపీఎన్ఆర్ అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా పీ తులసీ దాస్, మహిళా కార్యదర్శులుగా డాక్టర్ పాంగ్రంగి, శారద, కార్యదర్శులుగా బాలకృష్ణ పట్నాయక్, బొమ్మాడ నరసింహారావు, గౌరవ అధ్యక్షుడుగా టి.పట్టాభిరామయ్యను నిమించారు.

ఆదివాసీ సంఘ అధ్యక్షుడిగా జితేంద్ర



సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి రండాపల్లి పంచాయతీలో సోమవారం ఆదివాసీ సంఘం తరపున సమావేశం జరిగింది. సర్పంచి ఆనంద్ హల్వా నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుల ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా జితేంద్ర నాయక్, ఉపాధ్యక్షుడిగా ఆనంద్ హల్వా, ఎడిటర్‌గా భగవాన్ కెందు తదితరులు ఎంపికయ్యారు. 22 పంచాయతీలకు చెందిన సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఖుర్దా కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాదం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఖుర్దా పాలనాధికారి కార్యాలయం వినతుల స్వీకరణ విభాగంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఇన్వెర్టర్ పేలడంతో మంటలు వ్యాపించాయి. పాలనాధికారి చంచల్ రాణా విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదమేమీ జరగలేదని, పొగ వ్యాపించిన తరువాత అగ్నిమాపక జవాన్లు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

బాణసంచా పేలుడులో వ్యక్తి మృతి

నవరంగపూర్, న్యూస్‌టుడే: గణేష నిమజ్జనంలో భాగంగా బాణసంచా పేలుడులో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితికి చెందిన దీపక్ హరిజన్ (30) గా పోలీసులు గుర్తించారు. ఆదివారం రాత్రి జరిగిన గణేష నిమజ్జనంలో ఈ ఘటన జరిగింది. నిప్పురవ్వలు తుళ్లి ఆయన శరీరం 50 శాతం కాలిపోగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. శవపరీక్ష అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

జూదరులపై పోలీసుల దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పెద్దబజారు ఠాణా పరిధిలోని సుకుండా ప్రాంతంలో సాగుతున్న జూదంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఏడుగుర్ని అదుపులోకి తీసుకుని, వారి నుంచి లక్షలాది రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం సామాజిక మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. దీనిపై ఇంతవరకూ పోలీసులు అధికారికంగా ఎటువంటి వివరాలు తెలియజేయలేదు.

374 కిలోల గంజాయి పట్టివేత

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పికప్ వ్యానులో అక్రమంగా తరలిస్తున్న 374 కిలోల గంజాయిని చంద్రపూర్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ ధరణిధర్ నాయక్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రపూర్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ పికప్ వ్యాన్ ఆపి పరిశీలించగా తొమ్మిది బస్తాల్లో 374 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి నిందితులుని అదుపులోకి తీసుకున్నారు. వీరు గజపతి జిల్లా అడబకు చెందిన అరుణ్ బిశోయి, రాయగడ జిల్లా బీజాపూర్‌కు చెందిన మిథున్‌గా గుర్తించామని ఐఐసీ నాయక్ వెల్లడించారు. ఎస్సైలు బీరేంద్ర రాయ్, అరుణ్ బెహరా, ఏఎస్సై నర్సింగ్ బెహరా ఉన్నారు.

గాయపరిచిన ఎలుగు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్ సమితిలో ఎలుగు దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. హతిగావ్ పంచాయతీకి చెందిన సోనుగండ్, స్నేహితులతో కలిసి సోమవారం గ్రామ శివారులోని అడవికి కట్టెల కోసం వెళ్లాడు. ఈ సమయంలో భల్లూకం సోనుపై దాడి చేసింది. బాధితుడు చాకచక్యంతో తప్పించుకొని గ్రామానికి చేరుకోగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఉమ్మర్‌కోట్ సబ్‌డివిజన్ ఆసుపత్రిలో చేర్చారు.

కలహండిలో ఇంటర్ విద్యార్థికి తీవ్రగాయాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: హాస్టల్ భవనం నుంచి ఓ విద్యార్థిని తోటి విద్యార్థులు నెట్టేయడంతో తీవ్ర గాయాలైన ఘటన కలహండి జిల్లాలో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని భవానీపట్న శివారు ప్రాంతం జగన్నాథపురంలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంటర్ విద్యార్థి అంకేశ్ బాగ్‌ను తోటి విద్యార్థులు రెండో అంతస్తు నుంచి నెట్టేయడంతో బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. భౌతిక దాడి చేయడంతో పాటు భవనం నుంచి నెట్టేసిన విద్యార్థులు బెదిరించినట్లు బాగ్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైందని, దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పాడియాలో కొత్త ఆరోగ్య కేంద్రం ప్రారంభం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా పాడియ సమితి పోడియా గ్రామంలో కొత్త ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ బలభద్ర మాఝి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుపటి కంటే ఆరోగ్య కేంద్రంలో గదులు పెంచడంతో ఎక్కువ మంది రోగులకు చికిత్సలు చేసే సదుపాయం కలుగుతోందన్నారు. ప్రభుత్వం ఆరోగ్యం, విద్యా అభివృద్ధిపై దృష్టి పెడుతోందని అన్నారు. పంచాయతీల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరిచి వైద్యులను నియమిస్తామన్నారు. మల్కాన్‌గిరి శాసన సభ్యుడు నరసింహ మడ్కామి, జిల్లా ఆరోగ్యాధికారి ధనేశ్వర్ మహాపాత్ర, పాడియా సమితి అభివృద్ధి అధికారి అభమన్యు కవి శత్పథి,పాడియా ఆరోగ్య కేంద్రం సమితి ఆరోగ్యాధికారి సిద్ధార్థసంకష్ దాస్ తదితర సిబ్బంది ఉన్నారు.

బ్రహ్మపురలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి



అదనపు ఎస్పీ రమేష్‌చంద్ర సెఠిను కలిసి చర్చిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో అస్తవ్యస్థంగా మారిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కన్హా ఛారిటబుల్ ట్రస్ట్ పోలీసు అధికారులకు విన్నవించింది. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రంజనా మిశ్ర నాయకత్వంలో పలువురు ప్రతినిధులు సోమవారం బ్రహ్మపుర ఎస్పీ కార్యాలయం బయట ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఎస్పీ పేరిట ఓ వినతిపత్రాన్ని అదనపు ఎస్పీ రమేష్‌చంద్ర సెఠికి అందజేసి ట్రాఫిక్ ఇబ్బందులు వివరించారు. ఇటీవల బెజ్జిపురం ప్రధాన రహదారి పక్కన పూజా సామగ్రి అమ్మకాలతో ఉపాధి పొందుతున్న ఓ మహిళా చిరు వ్యాపారిపై ఆదివారం ఓ కారు దూసుకుపోయి మృతిచెందిన విషయాన్ని గుర్తు చేశారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం



చెత్తా చెదారం తొలగిస్తున్న వ్యర్థాలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కేంద్రీయ విశ్వవిద్యాలయం సునాబెడ క్యాంపస్‌లో సోమవారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఛాన్స్‌లర్ చక్రధర్ త్రిపాఠి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ సేవా విభాగం విద్యార్థులు క్యాంపస్‌లో వ్యర్థాలను తొలగించారు. పరిసర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. జాతీయ సేవా విభాగం ప్రోగ్రాం అధికారి టి.ఆంజనేయులు నేతృత్వంలో అధ్యాపకుడు బీసీ జా, డీన్ రామేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థులపై చిన్నచూపు వద్దు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదివాసీ విద్యార్థులపై చిన్న చూపు వద్దని సీఎల్పీ నేత, పొట్టంగి నియోజకవర్గం ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం కోరారు. పొట్టంగి సమితి మాలిపుట్ పంచాయతీకి చెందిన సిపాయిపుట్ ఆశ్రమం పాఠశాలను సోమవారం ఉదయం ఎమ్మెల్యే సందర్శించారు. బడి పనీ తీరు, భోజన నాణ్యత పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్నా మెనూ ప్రకారం భోజనం అందజేయాలన్నారు.



ఆహారం నాణ్యత పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడం

పాఠ్య పుస్తకాలు అందజేత



జూనియర్ కళాశాల విద్యార్థులతో రోటరీ ప్రతినిధులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాలపూర్ ప్రాంత ప్లస్‌టు పేద విద్యార్థులకు రోటరీ క్లబ్ ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేసింది. సోమవారం క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రోటరీ జిల్లా సహాయ గవర్నరు ప్రమోద్‌కుమార్ పండా, అధ్యక్షుడు అశోక్ బెహరా, కార్యదర్శి ఎ.హరికృష్ణ, సలహాదారు ఎ.సత్యం తదితరులు విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు.

హామీలను విస్మరించారు



సమావేశంలో మాట్లాడుతున్న శాసన సభ్యుడు రూపేష్ పాణిగ్రహి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: అధికార పార్టీ భాజపా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రహి అన్నారు. సోమవారం గుసాని సమితిలోని బిజద పార్టీ కార్యాలయంలో అక్టోబర్ రెండో తేదీన నిర్వహించే పాదయాత్రపై నాయకులతో సమావేశం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, జడ్పీ సభ్యుడు ఎస్.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ కేంద్రాల వద్ద వ్యాపారుల హవా

జయపురం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో ప్రతీ ఇంటికి రాగులు సరఫరా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీన్ని వ్యాపారులు సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పీడీఎస్ కేంద్రాల వద్దే లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి అధిక ధరకు అమ్ముకుంటున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలో అంతిమ యాత్ర

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్‌లో శ్మశానానికి వెళ్లేందుకు అవస్థలు తప్పడం లేదు. సోమవారం పట్టణంలోని 8వ వార్డుకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు వెళ్లే మార్గంలో కాలువపై వంతెన లేకపోవడంతో నీటిలో మోసుకెళ్లారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.



మృతదేహాన్ని నదిలో మోసుకొని వెళ్తున్న గ్రామస్థులు

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేదు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్, కటక్ కమిషనర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన సురేష్ దేవదత్త సింగ్ విలేకరులతో మాట్లాడారు. నేరస్థులతో కఠినంగా వ్యవహరిస్తానని, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడేది లేదని పేర్కొన్నారు. దసరా వేడుకల్లో జంట నగరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. 1998 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సింగ్ సమర్థ అధికారిగా మన్ననలందుకున్నారు. ఇంత వరకు కమిషనర్‌గా విధులు నిర్వహించి బదిలీ అయిన సంజీవ్ పండా సింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు చేపట్టిన దేవదత్తతో కరచాలనం చేస్తున్న సంజీవా పండా

ఉపాధ్యాయులు మార్గ దర్శకులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు మార్గ దర్శకులు.. వారు తీర్చిదిద్దిన దిశలో సమాజం నడుస్తుందని నవరంగపూర్ శాసన సభ్యుడు గౌరీశంకర్ మాఝి అన్నారు. సోమవారం నిఖిల ఉత్కళ ప్రాథమిక ఉపాధ్యాయుల ఫెడరేషన్ తరపున నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా ఫెడరేషన్ అధ్యక్షుడు కృష్ణచంద్ర పండా నేతృత్వంలో కార్యక్రమం జరిగింది.

స్థానికులకు అవకాశమివ్వాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ శిక్షణ పొందిన అభ్యర్థులు

రాయగడ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ శిక్షణ పొంది, ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్న జిలాకు చెందిన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు జిల్లాలోనే అవకాశాలు కల్పించాలని నినదిస్తూ అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం సమితి కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకొని నినదించారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న తృతీయ, చతుర్థ శ్రేణి విధానం తొలగించి జూనియర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలని కోరారు.

బీఎస్ఎఫ్ బలగాల అవగాహన కార్యక్రమం

మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: బీఎస్ఎఫ్ బలగాల ద్వారా మాదకద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలపై దృశ్యనాటిక ప్రదర్శించారు. లమతపుట్ సమితి ఒనకడిల్లీలో పహారా కాస్తున్న 180 బెటాలియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. సోమవారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల అలవాటుతో జరిగే నష్టాలను వివరిస్తూ నాటిక ప్రదర్శించారు. బీఎస్ఎఫ్ జాగిలం బ్రెజిల్ సెపార్డ్ వివిధ విన్యాసాలు ప్రదర్శించింది. బీఎస్ఎఫ్ కమాండెంట్ రాజేశ్‌కుమార్, అధికారులు, కాంగ్రెస్ నాయకుడు పీఎస్ఎన్ మూర్తి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల వినియోగంపై జవానుల నాటిక

నాల్కో వైద్య శిబిరం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: దమన్‌జోడీ నాల్కో, నాల్కో ఫౌండేషన్ హెల్పేజ్ ఇండియా సంస్థలు సంయుక్తంగా పారిశుద్ధ్య కార్మికుల కోసం సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని నాల్కో కార్యనిర్వాహక సంచాలకులు నిరజంన్ బెహరా ప్రారంభించారు. 330 మంది కార్మికులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.



కార్మికులకు చేస్తున్న వైద్య పరీక్షలు

ఉచిత ఆరోగ్య పరీక్షలు



రక్తపోటు పరీక్షిస్తున్న వైద్యుడు నకుల్ సాహు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: భరద్వాజ్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో సోమవారం నీలకంఠనగర్ ప్రాంతంలోని హరిహరనగర్‌లో ఉచితంగా ఆరోగ్య పరీక్షల పరీక్షల శిబిరం జరిగింది. వైద్యుడు నకుల్ సాహు పాల్గొని పలువురికి రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు తదితరాలు పరీక్షించి, అవసరమయ్యే వారికి ఉచితంగా ఔషధాలు పంపిణీ చేశారు.

● స్వాతంత్ర యోధుడు, జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన రఘునాథ పండా 107వ జయంత్యుత్సవాలు వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించాయి. గిరిరోడ్డులోని పాఢి సెలబ్రేషన్స్ ఆవరణలో జరిగిన స్మారక సమావేశానికి అబనీ గయా అధ్యక్షత వహించారు. విద్యావేత్తలు కార్తీకచంద్ర రౌత్, ఆచార్య బిష్ణుచరణ చౌధురి, న్యాయవాది భగవాన్ సాహు, దేబరాజ్ దాస్ తదితరులు అతిథులుగా పాల్గొని పండా జీవిత విశేషాలపై ప్రసంగించారు.

'మీ సేవలు బాగున్నాయి.. అభినందనలు'



సత్కారం అందుకున్న అతిథులు. చిత్రంలో నిర్వాహక క్లబ్‌ల ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'వినూత్నంగా మీరు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు బాగున్నాయని, ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలి' అని వాసవీ క్లబ్స్ ఇంటర్‌నేషనల్ (వీసీఐ) జిల్లా గవర్నరు ఆత్మకూరి సాంబమూర్తి అన్నారు. వాసవీ క్లబ్ బ్రహ్మపుర, వాసవీ లేడీస్ క్లబ్‌ల జిల్లా గవర్నరు అధికారిక పర్యటన, వాసవీ వారోత్సవాల ముగింపు వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ప్రేమనగర్ మెయిన్ రోడ్డులోని రోటరీ సామాజిక భవనంలో నిర్వహించిన దీనికి వాసవీ క్లబ్ బ్రహ్మపుర అధ్యక్షుడు కె.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. వేడుకల్లో వీసీఐ క్యాబినెట్ కార్యదర్శి గుంపిన నారాయణరావు, వైస్ గవర్నరు కె.వెంకటరావు, రీజనల్ ఛైర్మన్ సీహెచ్.మురళీకృష్ణ, జోన్ ఛైర్మన్ ఎ.ప్రశాంత్‌లు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సరస్వతీ పథకం కింద ఇద్దరు పేద విద్యార్థినుల చదువుకు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని నిర్వాహకులు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. బ్రహ్మపురలోని వేద పాఠశాలకు రూ.10 వేలు విలువ చేసే పాఠ్య పుస్తకాలు, వాసవీ ప్రసాదం కింద 18 పేద ఆర్య వైశ్య కుటుంబాలకు ఉదయం ఫలహారానికి అవసరమయ్యే నిత్యావసరాలు, ఓం జరా నివాస్ వృద్ధాశ్రమానికి నెలవారీ సరకులు అతిథులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ లేడీస్ అధ్యక్షురాలు ఎం.ప్రశాంతి, వాసవీ క్లబ్ బ్రహ్మపుర యాక్టింగ్ కార్యదర్శి ఎ.మురళీ కృష్ణ, కోశాధికారి పి.హరిరామ్, ప్రాజెక్ట్ ఛైర్‌పర్సన్స్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.కల్పన తదితరులు పాల్గొన్నారు. పలువురు క్లబ్‌ల ప్రతినిధులు, ఇతరులు హాజరయ్యారు.

బెజ్జిపురం, గుసానినువాగాంలో ఆక్రమణల తొలగింపు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సోమవారం ఆక్రమణలు తొలగించింది. బెజ్జిపురం నుంచి గుసానినువాగాం వరకు రహదారుల్లో ఇరువైపులా ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న దుకాణాలను, తోపుడుబళ్లను తొలగించారు. బీఈఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రోణిత్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది తొలగింపులు చేపట్టారు. బెజ్జిపురం ప్రధాన రహదారిలో ఆదివారం రోడ్డుపక్కన పూజా సామగ్రి అమ్ముతున్న ఓ మహిళపై కారు దూసుకెళ్లిన ఘటనలో ఆమె మృతి చెందిన సంగతి విదితమే. దీంతో బీఈఎంసీ ఆయా ప్రాంతంలో తొలగింపులు చేపట్టింది.



సోంపేట మండలం బారువ ఎస్సీ వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి భోజనాలకు నెలకు రూ.1.12 లక్షల వరకు ఖర్చవుతోంది. ఇతర నిర్వహణ ఖర్చులు, ట్యూటర్ల వేతనాలకు రూ.లక్షకుపైగా చెల్లింపులు జరగాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు సతమతమవుతున్నారు. జిల్లాలోని మిగిలిన వసతి గృహాల పరిస్థితి ఇలాగే ఉంది.

జిల్లాలో వివరాలిలా..

- వసతి గృహాలు: 31
- కళాశాలలకు చెందినవి: 10
- ప్రీ మెట్రిక్: 21
- విద్యార్థులు: సుమారు 3 వేలు

బిల్లులివ్వకుండా బువ్వ పెట్టేదెలా..?

- ఎస్సీ వసతి గృహాలకు రూ.కోట్లలో బకాయిలు
- గత ప్రభుత్వ నిర్వాకంతో తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, సోంపేట, పలాస


ఎస్సీ వసతి గృహాల నిర్వహణ రోజు రోజుకీ భారమవుతోంది. వైకాపా ప్రభుత్వం బిల్లుల చెల్లింపులపై శీత కన్ను వేయడంతో ఇప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమ వసతిగృహాల బిల్లులకు నిధులు కేటాయించింది. అయినప్పటికీ సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారుల తీరుతో ఇప్పటి వరకు చెల్లింపులకు అవకాశం లేకుండా పోయింది. ఈ ప్రభావం మెనూ అమలుపై కూడా పడుతోంది. అప్పులు చేసి పిల్లలకు భోజనం పెడుతున్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని ఎస్సీ వసతి గృహాలకు ఈ ఏడాది నుంచి బిల్లులు మంజూరు కాలేదు. ఆగస్టు వరకు రూ.3 కోట్లకు పైగానే చెల్లింపులు జరగాల్సి ఉంది. వైకాపా ప్రభుత్వం గతేడాది డిసెంబరు వరకే బడ్జెట్‌లో కేటాయింపులు చేపట్టింది. ఆ తర్వాత నిధులివ్వకుండా కాలయాపన చేసింది. ఇంతలో ఎన్నికల ప్రకటన రావడంతో బిల్లుల చెల్లింపులకు అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఆ మేరకు వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమశాఖల ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. దీంతో ఆగస్టు వరకు బిల్లుల చెల్లింపులకు అవకాశం ఏర్పడింది. సాంఘిక సంక్షేమశాఖకు మాత్రం ఉన్నతాధికారులకు నుంచి ఇంకా బిల్లులు పెట్టుకునేందుకు జిల్లాకు అనుమతులు రాలేదు. ఫలితంగా దసరా సెలవులు డబ్బులు వచ్చే పరిస్థితి కనిపించట్లేదని సంక్షేమాధికారులు లబోదిబోమంటున్నారు.

అన్నీ బకాయిలే..



- వసతి గృహాల్లో భోజనాల నిమిత్తం కళాశాల విద్యార్థులకు నెలకు రూ.1,600, పాఠశాల విద్యార్థులకు రూ.1,400, కాస్మోటిక్స్ ఛార్జీలుగా రూ.150 చొప్పున చెల్లించాలి.



- ఒక్కో హాస్టల్‌లో నలుగురు బోధకులు ఉన్నారు. వారికీ గత నవంబరు నుంచి వేతనాల్లేవు. వీరికి ఒక్కొక్కరికీ అప్పటి నుంచి నెలకు రూ.1,500 చొప్పున బకాయి ఉంది.



- పారిశుద్ధ్యం, ఇతర నిర్వహణ ఖర్చులకూ నిధులు మంజూరు కాలేదు. జిల్లాలో వసతి గృహాలన్నింటికీ కలిపి నెలకు రూ.50 లక్షల వరకు రావాల్సి ఉంది.

నిధులు మంజూరు చేయాలి...

బిల్లులు రాకపోవడంతో వసతి గృహం నిర్వహణ కష్టంగా ఉంటోంది. వ్యాపారులు సరకులిచ్చేందుకు ఇబ్బంది పెడుతున్నారు. ఆడపిల్లలకు కాస్మొటిక్ ఛార్జీలూ ఇవ్వట్లేదు. గ్యాస్ కోసం సొంత డబ్బులు ఖర్చు పెడుతున్నాం. అధికారులు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి. – విజయలక్ష్మి, బాలికోన్నత వసతి గృహసంక్షేమాధికారి

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

బడ్జెట్‌లో బిల్లుల చెల్లింపులకు కేటాయింపులు జరిగాయి. నిర్వహణ పరమైన ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డైరెక్టర్ కార్యాలయం నుంచి అనుమతులు రాగానే నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం.
– విశ్వమోహన్‌రెడ్డి, ఉప సంచాలకులు, సాంఘిక సంక్షేమశాఖ

ఆట పాటలతో వినూత్న బోధన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తూ, ఆటపాటలతో వినూత్న బోధన చేపట్టాలని ఎమ్మెల్యే టి.జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించారు. చిన్నారులతో ముచ్చటించి పరికరాలు పరిశీలించారు. ఎంపీడీవో సాల్మన్‌రాజు, సీడీపీవో సుశీలాదేవి, సర్పంచి గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలకు సహకరించాలి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ బి.సురేష్, ఎస్ఆర్పీలు ఎస్.మాధవరావు, బి.దాసు కోరారు. సోమవారం జియ్యమ్మవలసలో ఎంపీపీ ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, క్షేత్ర సహాయకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మంగళవారం నుంచి 31 పంచాయతీల్లో 2023-24లో రూ.24 కోట్లతో చేపట్టిన 2,500 పనులు, 8.48 లక్షల పని దినాలపై తనిఖీలు ఉంటాయన్నారు. ఏపీడీ ఆర్.సురేష్‌నాయుడు, ఎంపీడీవో కె.రామారావు, ఉప ఎంపీపీ జి.సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం



క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణించే విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. సోమవారం సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి అండర్- 17 బాలబాలికల హ్యాండ్‌బాల్ క్రీడా ఎంపికలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు చరవాణులకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలపై శ్రద్ధ చూపాలన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలు పాఠశాలల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు తరలివచ్చినట్లు పాఠశాల క్రీడల కార్యదర్శి ఎం.మురళీ కృష్ణ తెలిపారు. తెదేపా పట్టణాధ్యక్షుడు ఎన్.చిట్టి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఆందోళన

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా కన్వీనరు బి.వి.రమణ డిమాండు చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. జేసీ శోభికకు వినతిపత్రం ఇచ్చారు.



ఆందోళన నిర్వహిస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు

జిల్లాలో తీర ప్రాంత విస్తీర్ణం	మండలాలు	మత్స్యకార గ్రామాలు	తీరానికి దగ్గరలో ఉన్న ఇతర గ్రామాలు	జనాభా	సామాజిక అటవీ ప్రాంతం	తీర ప్రాంత చిత్తడి నేలల విస్తీర్ణం	రొయ్యల చెరువుల విస్తీర్ణం
193 కి.మీ.	11	154	130	7 లక్షలు	14 వేల హెక్టార్లు	8 వేల హెక్టార్లు	12 వేల హెక్టార్లు

కడలి అంచున కలవరం..!

- కోతకు గురవుతున్న తీరం
- రక్షణ చర్యలు కరవు



సోంపేట మండలం గొల్లగండి పరిధిలో 30 అడుగుల మేర కోతకు గురైన తీరం

భూతాపం పెరగడం, వాతావరణంలో మార్పులు, మానవ చర్యల ఫలితంగా తీర ప్రాంత గ్రామాలు ప్రమాదకర స్థితిలోకి వెళ్లే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ జియోఫిజిక్స్ విభాగం చేపట్టిన అధ్యయనంలో జిల్లాలో 25 కి.మీ. మేర తీర ప్రాంత భూభాగం ప్రమాదంలో ఉందని తేలింది. సముద్రపు గాలులను నిలువరించి ఇసుక కోతను అరికట్టే సరుగుడు వనాలు, తాటిచెట్లు, మొగలి పొదలు, ఇతర తోటలను ధ్వంసం చేయడం, చిత్తడి నేలల్ని పరిరక్షించకపోవడమే కారణమని విశ్లేషించారు. తుపానులతో గుణపాఠం నేర్చుకున్న ఒడిశా పాలకులు అక్కడ తీరం భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇక్కడ విపత్తుల సమయంలో హడావుడి చర్యలు తప్ప రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ముప్పు ముంగిటకు సిక్కోలు తీరం చేరే పరిస్థితి తలెత్తింది.

– న్యూస్‌టుడే, సోంపేట

★ సునామీ సమయంలో తీరం రక్షణకు ఇచ్చిన హామీలు రెండున్నర దశాబ్దాలు దాటినా కార్యరూపంలోకి రాలేదు. 1999 నుంచి 2018 వరకు ప్రతి రెండేళ్లకు ఒకసారి విపత్తులు సంభవిస్తూనే ఉన్నాయి. ఫైలిన్, హుద్‌హుద్, తిత్లీ తుపానులు జిల్లాను అతలాకుతలం చేశాయి.

★ రణస్థలం, ఎచ్చెర్ల, గార మండలాల పరిధిలో పరిశ్రమల రసాయనాలు సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ఖనిజాలు, ఇతర అవసరాలకు గార, శ్రీకాకుళం, రణస్థలం, తదితర మండలాల పరిధిలో గ్రామాలకు రక్షణ గోడల్లా ఉన్న ఇసుక తిన్నెల్ని తొలగిస్తున్నారు. ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు 11 మండలాల పరిధిలో 5 వేల హెక్టార్లకు పైగా తీర ప్రాంత భూములు ఆక్రమించి రొయ్యల చెరువులు, తోటలు, పొలాలు, వివిధ నిర్మాణాలతో ముప్పు పొంచి ఉంది.

★ తీరానికి 500 మీటర్ల పరిధిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదన్న నిబంధనలు విస్మరించడం, రొయ్యల చెరువుల సాగు, ఇతర చర్యలు భద్రతను ప్రశ్నార్థకంగా మార్చాయి. 50 మత్స్యకార గ్రామాలు తీరానికి దగ్గరలో ఉన్నాయి. గత ప్రభుత్వం పేదల ఇళ్లకు కేటాయించిన కాలనీ స్థలాలు సముద్రానికి మరింత సమీపంలో ఇవ్వడం గమనార్హం. అలల తాకిడిని తగ్గించి తీరం కోతను అరికట్టే మడ అడవులు, సరుగుడు, మొగలి పొదలు దాదాపుగా మాయమయ్యాయి. ఖరీఫ్‌లో సముద్రం 300 మీటర్ల వరకు ముందుకొచ్చి తీరం భారీగా కోతకు గురైంది.

ముంచెత్తుతున్న అలలు


తీరానికి సమీపంలో 1.25 లక్షల ఎకరాల్లో కొబ్బరి, జీడి, ఇతర ఉద్యాన తోటలు, 1.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వీటి ఆధారంగా ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారు. సముద్రంలో నెలకొన్న పరిస్థితులు ఉద్యాన తోటలు, పంట పొలాలపై తీవ్ర ప్రభావం చూపుతుండటంతో ఆర్థిక స్థితి గణనీయంగా దిగజారుతోంది. తుపానుల నేపథ్యంలో వీచే గాలుల తీవ్రతను తగ్గించే పరిస్థితి తీరంలో లేకపోవడంతో అవి నేరుగా భూతలాన్ని తాకుతున్నాయి. ఉద్యాన, వ్యవసాయ పంటలు ధ్వంసమవుతున్నాయి. అలల తాకిడి అధికమవుతుండటంతో తీర ప్రాంతం భారీగా కోతకు గురై గ్రామాల్లోకి సముద్రం చొచ్చుకొస్తోంది.

వనాలు పెంచకపోతే వినాశనమే

తీరానికి కనీసం కి.మీ విస్తీర్ణంలో మడ అడవులు, సరుగుడు, ఇతర చెట్లు పెంచడానికి తక్షణ చర్యలు తీసుకుంటే గాలుల తీవ్రత తగ్గించేందుకు, కోత నివారణకు అవకాశం ఏర్పడుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే వినాశనం తప్పదు. జీవన విధానంలో మార్పు, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడితే కొంతమేర ఉపశమనం కలుగుతుంది.
– జె.జగన్నాథరావు, భూవిజ్ఞాన శాస్త్రవేత్త,

నివేదికలపై స్పందన శూన్యం

గత 15 నెలలుగా సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల కంటే ఎక్కువగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. పోటుపాట్ల సమయంలో కెరటాలు ఏడు అడుగులకు పైగా ఎగిసిపడుతున్నాయి. 2030 నాటికి తీరంలో పలు గ్రామాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ సంస్థలు, నిపుణులు, శాస్త్రవేత్తలు ఇచ్చిన నివేదికలపై స్పందన లేదు.
– ఎం.బాబూరావు, విశ్రాంత సీనియర్ శాస్త్రవేత్త



తిత్లీ తుపాను సమయంలో బారువకొత్తూరు గ్రామం వద్దకు చొచ్చుకొచ్చిన సముద్రం

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు

బెలగాం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు పేర్కొన్నారు. ఐఆర్‌డబ్ల్యూఏ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పార్వతీపురం కోర్టు ఆవరణలో సంబంధిత గోడప్రతులను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ అదనపు మేజిస్ట్రేట్ సౌజన్యతో కలిసి విడుదల చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, గ్రామాల్లో యువత చిన్నారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయవాదులు జి.వెంకటరావు, సంస్థ డైరెక్టర్ ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు తదితరులు

నిత్యం.. భయం భయం



గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి నిర్వాసిత గ్రామం సుంకిలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 2005లో నిర్వాసిత గ్రామంగా గుర్తించారు. అప్పట్లో 180 కుటుంబాలు ఉండేవి. ప్యాకేజీలో భాగంగా అధికారులు 370 కుటుంబాలను ఎంపిక చేసి తులసిరామినాయుడువలస సమీపంలో 326 ఎకరాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలకు మార్కింగు చేశారు. సీసీ రహదారులు నిర్మించారు. విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. కానీ నిర్వాసితులు పాత ఇళ్లలోనే ఉంటున్నారు. ఏళ్లు గడుస్తుండటంతో అవి ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. దీంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై ఉప తహసీల్దారు లక్ష్మీకుమార్ వద్ద ప్రస్తావించగా.. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని 8 ఏళ్లుగా కోరుతున్నా నిర్వాసితులు ముందుకు రావడం లేదని తెలిపారు.
– న్యూస్‌టుడే, గరుగుబిల్లి

రాకపోకలకు స్తంభం అడ్డు

ఖజానావీధి-పోకల వీధి మధ్య రోడ్డు వేయక ముందు మట్టి రహదారి ఉండేది. ఆ సమయంలో విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేశారు. తరువాత సిమెంట్ రోడ్డు నిర్మించడంతో స్తంభం మధ్యలోకి వచ్చేసింది. దాంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏమరుపాటుగా ఉంటే స్తంభాన్ని ఢీకొంటారని, ప్రత్యామ్నాయ చోటులో ఏర్పాటు చేసి, ఇక్కడ నుంచి దానిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఏఈ గోవిందరావు తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



అధ్వాన మార్గం.. ప్రయాణం నరకం



వజ్రపుకొత్తూరు మండలం పూండి నుంచి మంచినీళ్లపేట మధ్య రోడ్డు పలు చోట్ల పాడై ప్రమాదకంగా మారింది. 10 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు ప్రస్తుతం అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలతో పలు ద్విచక్ర వాహన ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్నపుడు గుంతల్లో వాహనాలు దిగడంతో ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రద్దీగా ఉన్న ఈ మార్గంలో తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖ జేఈ విక్రమ్ మాట్లాడుతూ మంచినీళ్లపేట రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.
-న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



గ్రామైక్య సంఘాలకు భరోసా..!

- పొదుపు సంఘాలకు కూటమి ప్రభుత్వం అండ
- యూనిట్ ఆధారంగా రుణాల మంజూరు

– న్యూస్‌టుడే, పొందూరు

- పొందూరు మండలంలో రాజేశ్వరి పొదుపు సంఘంలో గతంలో బ్యాంకు లింకేజీ రూ.10 లక్షల రుణం తీసుకునేందుకు పొదుపు సంఘం తీర్మానంతో పాటు సీసీలతో ఫొటోలు, ఇతర పత్రాలు అందిస్తే రుణం వచ్చేందుకు 15 రోజులు దాటేది. ప్రస్తుతం అలాంటి ఇబ్బందుల్లేకుండా పొదుపు సంఘ తీర్మానంతో పాటు సంబంధిత పత్రాలు సీసీలకు అందిస్తే బ్యాంకు ద్వారా వారం రోజుల్లో రుణం వచ్చేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.
- జి.సిగడాం మండలంలో కాశీవిశ్వేశ్వర పొదుపు సంఘంలో బ్యాంకు లింకేజీ రూ.12 లక్షల రుణం కోసం గతంలో తీర్మానంతో పాటు అన్ని పత్రాలు అందించినా బ్యాంకు అధికారులు జాప్యం చేసేవారు. ఇప్పుడు ప్రభుత్వం బ్యాంకు అధికారులకు సకాలంలో సంఘాల సభ్యులకు రుణాలివ్వాలని ఆదేశాలివ్వడంతో త్వరగా లింకేజీ రుణాలు అందిస్తున్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలకు గతంలో పొదుపు సంఘాల సభ్యులు ఇబ్బందులు పడేవారు. బ్యాంకులు కూడా పొదుపు సంఘాలకు రుణాలిచ్చేందుకు గతంలో నిబంధనల పేరుతో ఇబ్బంది కల్పించేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక పొదుపు సంఘాల ఆర్థిక పురోగతిపై దృష్టి సారించింది. యూనిట్ల ఏర్పాటుకు రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తుంది. గతంలో రూ.3 లక్షల వరకు మాత్రమే వడ్డీ రాయితీ ఉండేది. తాజాగా రూ.10 లక్షల వరకు వడ్డీ లేకుండా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అవసరం మేరకు ఇంకా అదనంగా రుణం మంజూరు చేయనున్నారు. దీనిపై త్వరలో విధి విధానాలు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.



పొందూరులో సమావేశమైన పొదుపు సంఘ సభ్యులు

వీటికే అధిక ప్రాధాన్యం..

ప్రస్తుతం బ్యాంకు లింకేజీ ద్వారా సంఘానికి రూ.20 లక్షల వరకు రుణం ఇస్తున్నారు. ఆదాయం వచ్చే యూనిట్లు వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ఇతర పరికరాల కొనుగోళ్లకు ఈ రుణం తీసుకోవచ్చు. బ్యాంకుల వారీగా 9 నుంచి 12 శాతం వరకు వడ్డీ ఉంటుంది. జిల్లాలో 45,980 పొదుపు సంఘాలు ఉండగా ఈ ఏడాది బ్యాంకు లింకేజీ రుణాలు అధికారులు అందిస్తున్నారు. కోళ్లఫారం, వ్యవసాయం, చిల్లర దుకాణాలు, కూరగాయలు, దుస్తులు, గాజుల దుకాణాలు, డెయిరీ ఫామ్స్, తదితర యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకు లింకేజీ రుణాలు అధికంగా ఇచ్చేందుకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు.

సీసీఎల్ పద్ధతిలో మంజూరు..

రుణాలను క్యాష్ క్రెడిట్ లోన్ (సీసీఎల్) పేరిట మంజూరు చేస్తున్నారు. తీసుకున్న సొమ్ములో 65 శాతానికి పైగా తిరిగి చెల్లిస్తే కొత్తగా మరోసారి రుణం తీసుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా జీవనోపాధి మెరుగుపరుచుకోవచ్చు. గతంలో కన్నా ప్రస్తుతం పొదుపు సంఘాలకు త్వరగా రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్థిక పురోగతికి దోహదం

గతంలో రూ.3 లక్షల వరకు రుణానికి వడ్డీ రాయితీ ఉండేది. కొత్త విధానం ద్వారా రూ.10 లక్షల వరకు రుణానికి వడ్డీ రాయితీ ఉంటుంది. ఈ విధానం ఎంతో మందికి ఆర్థికంగా వ్యాపారాలకు ఉపయోగపడుతుంది. కొత్త విధానంపై విధి విధానాలు రావాల్సి ఉంది. పొదుపు సంఘాల ఆర్థిక పురోగతికి ఇది దోహదపడుతుంది.
– ఆకుల నాగలక్ష్మి, బ్యాంకు లింకేజీ డీపీఎం, శ్రీకాకుళం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యం:	ఆగస్టు వరకు ఇచ్చినది:
36,133 సంఘాలకు రూ.18.21 కోట్లు	8,720 సంఘాలకు రూ.5.38 కోట్లు

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు

కొమరాడ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సనాతన ధర్మ పరిరక్షణ కోసం చేపడుతున్న ప్రాయశ్చిత్త దీక్షకు కురుపాం నియోజకవర్గ జనసేన నాయకులు మద్దతు పలికారు. సోమవారం నియోజకవర్గ పార్టీ బాధ్యుడు కె.మల్లేశ్వరరావు తదితరులు గుంప సోమేశ్వరాలయంలో పూజలు చేశారు. ఆలయంలో అఖండ దీపారాధన చేపట్టారు. కురుపాం, జియమ్మవలస మండలాల కన్వీనర్లు ఎన్.వంశీ, వి.శివకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.



శివాలయంలో పూజలు చేస్తున్న జనసైనికులు

పత్తిలో సస్య రక్షణకు చర్యలు

పాచిపెంట, న్యూస్‌టుడే: పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో తిరుపతిరావు సూచించారు. మండలంలోని పి.కోనవలస, పద్మాపురం గ్రామాల రైతులకు సోమవారం సస్యరక్షణపై అవగాహన కల్పించారు. పత్తిని ఆశించే ఆకుచుట్టు పురుగు నివారణకు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. వీఏఏ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

15 నెలలుగా బకాయిలు..

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, సాలూరు గర్భిణుల వసతి గృహాల్లోని ఆరోగ్య సిబ్బందికి 15 నెలల వేతనాలు చెల్లించాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ డిమాండు చేశారు. కలెక్టర్ ముందు నిరసన తెలిపారు. జీతాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు సిబ్బంది వాపోయారు.